క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: మండలంలోని దౌల్తాబాద్ టౌన్, దౌల్తాబాద్ రూరల్ ఫీడర్ల కింద ఉన్న గ్రామాలకు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, ట్రీకటింగ్ నిమిత్తం నేడు (బుధవారం) ఉ.8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావునా ప్రజలందరూ సహకరించాలని కోరారు.

కొడంగల్‌లో..

కొడంగల్ : మండల పరిధిలోని పెద్ద నందిగామ, చిన్ననందిగామ, ప్యాలమద్ది, హుస్సెన్‌పూర్, బుర్హుఖాన్‌పల్లి, దౌల్తాబాద్ మండలంలోని నందారం గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్ద నందిగామ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు. ఉ.8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు సరఫరా నిలిపోనుంది.

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

పరిగి ఆర్టీసీ డీఎం కరుణశ్రీ



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎం

పరిగి: ఉద్యోగుల కోసం ఆర్టీసీ ఉచితంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిందని పరిగి డీఎం కరుణశ్రీ పేర్కొన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ 2.0 ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులకు ఉచితంగా పరీక్షలతో పాటు చికిత్సలు అందిస్తారన్నారు. గతంలో కూడా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలోనే కస్తూర్బా కొనసాగింపు



కుల్కచర్ల కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల

కుల్కచర్ల: చౌడాపూర్ మండలానికి నూతనంగా మంజూరైన కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను ప్రస్తుత విద్యాసంవత్సరం కుల్కచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీలోనే కొనసాగించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. మండలంలో అవసరమైన భవనాలు అందుబాటులో లేకపోవడంతో కుల్కచర్ల భవనంలోనే అదనంగా కొనసాగించాలని తీర్మానించినట్లు సమాచారం. ఒకటి రెండురోజుల్లో అధికారిక ఉత్తర్వులు రాగానే 6, 7వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం కుల్కచర్ల ప్రత్యేకాధికారి దేవి కొనసాగనున్నారు.

త్వరితగతిన సిద్ధం చేయాలి

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్



దుస్తుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ

దౌల్తాబాద్: పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులందరికీ యూనిఫాం అందించాలని ఇందుకు త్వరితగతిన కుట్టు పనులు పూర్తి చేసి సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ ఐకేపీ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని దౌల్తాబాద్, ఈర్లపల్లి గ్రామాల్లో మహిళా శక్తి కుట్టు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఏకరూప దుస్తుల తయారీని పరిశీలించి మాట్లాడారు. దుస్తుల తయారీకి ఏర్పాటు చేసిన సంఘాల వారీగా వివరాలు తెలుసుకున్నారు. యూనిఫాం విషయంలో అలసత్వం వహించొద్దని తెలిపారు. ఆయన వెంట ఏపీఎం సాయన్న, ఎంపీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శి గోపాల్ తదితరులున్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న రాజేశ్

తాండూరు టౌన్ : తాండూరు పట్టణం సాయిపూర్‌లో ఉంటున్న మమత అనే మహిళా చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నిధుల నుంచి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఎల్‌ఓసీ మంజూరు చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. మంగళవారం ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు రాజేశ్ బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీని అందజేశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

టమాటాకు తామర దెబ్బ!



మోమిన్‌పేటలోని ఎన్కేపల్లిలో సాగు చేసిన టమాట



ఆకు ముడుచుకుపోయి కాయని టమాట

- పెట్టుబడులు పెరిగినా.. దిగుబడులు సున్నా
- తామర పురుగుతో నష్టాలు

మోమిన్‌పేట: అధిక పెట్టుబడులు పెట్టి దిగుబడులు బాగా వస్తాయని ఆశించిన టమాట రైతన్నకు అరిగోస తప్పలేదు. వేసవికాలంలో టమాటకు మంచి ధర పలుకుతోందని అనుకున్న రైతులకు టమాట పంటకు తామర పురుగు సోకి ఆకులు ముడుచుకుపోయి దిగుబడులు అమాంతం పడిపోయాయి. దీంతో రైతన్నకు నష్టాలు మిగిలాయి. ఎకరా సాగుకు రూ.50వేలకు పైగానే ఖర్చు చేస్తున్న రైతన్నకు ఏమీ మిగలలేదు. దుక్కి దున్ని ఎరువులు వేసి, బెడ్ తయారు చేసుకొని మల్చింగ్ వేస్తున్నారు. అనంతరం ట్రేకింగ్ చేయడంతో ఖర్చులు పెరిగిపోతున్నాయని అన్నదాత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని ఆశించిన రైతన్నకు తామర పురుగు సోకి చెట్టుకు ఒకటి, రెండు కాయలు మాత్రమే కాశాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానశాఖ అధికారులు సమయానికి అందుబాటులో లేకపోవడం వల్ల రైతుల అనుభవంతోనే పంటలు సాగు చేస్తున్నారు. సలహాలు, సూచనలు ఇచ్చే అధికారులు లేకపోవడంతో నష్టాల బారిన పడుతున్నామని పలువురు మండల రైతులు వాపోతున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు టమాట సాగుకు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. నర్సరీల్లో కొనుగోలు చేసి నాటుతున్న రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. నారు డిమాండ్‌ను బట్టి మొలక రూపాయికి ఒకటి చొప్పన నర్సరీ యాజమానులు అమ్ముతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం టమాట నాట్లు వేసిన రైతులు నష్టాల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

రెండు ఎకరాలలో...



రెండు ఎకరాలలో టమాట సాగు చేశా. రూపాయికి ఒక మొలక నర్సరీలో కొనుగోలు చేశాం. రూ.లక్షకు పైగానే పెట్టుబడి పెట్టా. తామర పురుగుతో ఆకు పూర్తిగా ముడుచుకుపోయింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలి.

– రైతు పటోళ్ల రాంచంద్రరెడ్డి, ఎన్కేపల్లి

ఎకరా సాగు చేశా..



వేసవి కాలంలో మంచి ధర పలుకుతుందని ఎకరా పొలంలో టమాట పంట సాగు చేశా. ఎరువులు, మందులు, మల్చింగ్, నారు, ట్రేకింగ్, చేయడంతో పెట్టుబడులు అమాంతం పెరిగాయి. టమాట సాగు చేసిన ప్రతి దగ్గర ఇదే పరిస్థితి. నర్సరీల్లో పెంచిన నారు సమస్య అయి ఉండవచ్చు. తామర పురుగు సోకి ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేదు.

– రైతు నర్సింలు, ఎన్కేపల్లి

మండుతున్న కూరగాయ ధరలు

- కిలో అల్లం వెల్లుల్లి రూ.300
- పచ్చి మిర్చి రూ.120



పెద్దేముల్ సంతలో విక్రయిస్తున్న కూరగాయలు

పెద్దేముల్: కూరగాయ ధరలు మండుతున్నాయి. మంగళవారం పెద్దేముల్ మండల కేంద్రంలో జరిగిన వారాంతపు సంతల్లో ధరల మోత మోగుతోంది. కిలో కూరగాయలు రూ.80 నుంచి రూ.120 వరకు పలుకుతుంది. ముఖ్యంగా అల్లం- వెల్లుల్లి రూ.280 నుంచి రూ.300కు చేరింది. గత 20 రోజుల క్రితం ఏ కూరగాయ కొనాలన్న కిలో రూ.30 నుంచి రూ.40 పలికేది. సాగు విస్తీర్ణం తగ్గటంతో ధరలు పెరిగాయని వ్యాపారస్తులు అంటున్నారు. ఆకు కూరలు కిలో రూ.60నుంచి రూ.80 అమ్ముతున్నాయి. పచ్చి మిర్చి కిలో రూ.100నుంచి రూ.120 ఉంది. పంట దిగుబడి ఉన్న సమయంలో ధర లేదని, పంట తగ్గిన తరువాత ధరలు అమాంతం పెరిగాయని రైతులు వాపోతున్నారు.

హరితహారానికి ఏర్పాట్లు



గుంతలు తవ్విస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కుల్కచర్ల: హరితహారం కార్యక్రమానికి గ్రామ పరిధిలో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కులకచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మొక్కలను ఏర్పాటు చేసేందుకు పాదులను తొవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామపంచాయతీ పరిధిలో ముందస్తు ఎర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మొక్కలు పెట్టేందుకు గుంతలను తీయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ ఆదర్శ' పనులు పూర్తి చేయండి

మండల ప్రత్యేకాధికారి జ్యోతిపద్మ



పెద్దేముల్: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి జ్యోతి పద్మ

పెద్దేముల్: అమ్మ ఆదర్శ పనులు ఈ నెల 31లోగా పూర్తి కావాలని మండల ప్రత్యేకాధికారి జ్యోతిపద్మ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం మండలంలోని అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పనులు పూర్తి కావాలని, ప్రారంభం కాని పాఠశాలల్లో పనులు ప్రారంభమయ్యేల చర్యలు తీసుకోవాలని మండల అధికారులను ఆదేశించారు. పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోని పనులు పూర్తి చేయాలన్నారు. మండలంలోని ఇందూరు, నర్సపూర్, తింసాన్‌పల్లి గ్రామా ల్లోని పాఠశాలల్లో పనులు ప్రారంభం కాలేదని, వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జర్నప్పను ఆదేశించారు. చేపడుతున్న పనులు పక్క ప్రణాళికతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జర్నప్ప, పంచాయ తీ రాజ్ ఏఈ సిద్దార్థతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శులు ఉన్నారు.

త్వరగా పూర్తి చేయాలి

దోమ : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రత్యేకాధికారి హన్మంతురావు ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని దాదాపూర్ పాఠశాలలను ఎంపీడీఓ మహేశ్‌బాబుతో కలసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తరగతి గదుల్లో విద్యుత్, బెంచీలు, గ్రీన్‌చాక్ బోర్డు, ఫ్యాన్లతో పాటు తదితర పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. వాటర్ సంపులు, టాయిలెట్లు త్వరితగతిన అందుబాటులోకి తెచ్చేందుకు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అనంతరం మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు కుట్టిస్తున్న యూనిఫాంలను పరిశీలించారు. స్కూళ్ల ప్రారంభం అయ్యే నాటికి విద్యార్థులకు దుస్తులను అందించాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, ఎంపీటీసీ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, సీసీ, సీఆర్‌పీ రెడ్యా నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి గ్రామంలో వెలసిన బ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారు జామున అగ్నిగుండం నిర్వహించారు. మధ్యాహ్నం వేద పండితుల ఆధ్వర్యంలో దేవతామూర్తులకు కల్యాణం జరిపించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ చెన్నయ్యగౌడ్ దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. బంటు వేణుగోపాల్ అన్నదానం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో పూడూరు పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి దర్గా ఉత్సవాలు

దౌల్తాబాద్: మండలంలోని అంతారంలో నేడు (బుధవారం) నుంచి శాదుల్లా హుసేన్ దర్గా ఉత్సవాలు జరగనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి గంధోత్సవం, గురువారం జాతర, రాత్రి 11గంటల నుంచి రెట్టపట్ల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రెట్టపట్ల కార్యక్రమంలో ముగ్గురిని ఓడిస్తే టెంకాయ, ఐదుమందిని ఓడిస్తే తులం వెండి కడియం బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో కాశీ విశాలాక్షి

ధారూరు: మండలంలోని బాచారంలో పటేల్ బస్వరాజమ్మ కుటుంబం నిర్మించిన అమ్మ వారి ఆలయ 5వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో నెలకొన్న కాశీ విశాలాక్షి, విశ్వేశ్వరస్వామీలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భ క్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, లాయర్ సంపూర్ణానంద్ రావు, అమర్‌పటేల్ దంపతులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

అనంతగిరి: ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వికారాబాద్‌లోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రాఘవీణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఉ.10 గంటలకు జరిగే కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొలని కోరారు.

మొక్కలను రక్షించుకుందాం



మొక్కలను నీరు పోస్తున్న సిబ్బంది

పెద్దేముల్: హరితహారంలో భాగంగా ప్రధాన రోడ్లకు ఇరువైపుల నాటిన ప్రతి మొక్క బతకాలని, ఎండిపోతే చర్యలు తప్పవని అధికారులు ఆదేశాలు జారి చేయడంతో ప్రతి నిత్యం పంచాయతీ సిబ్బంది నానా ఇబ్బందులు పడుతూ చెట్లకు నీరు పోస్తున్నారు. ఉదయం, సాయంత్రం నీరు పోసినా ఎండలకు వాడు ముఖం పడుతున్నాయి. మండలంలోని తాండూరు–జహీరాబాద్, తాండూరు– సంగారెడ్డి, తాండూరు– హైదరాబాద్ ప్రధాన రహదారులపై నాటిన మొక్కలను ఎలాగైనా బతికించాలనే ఉద్దేశంతో పంచాయతీ కార్యదర్శులు నీరు పోసి మొక్కలను కాపాడుతున్నారు. కానీ, మండల అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది.

వైభవంగా రేణుక ఎల్లమ్మ జాతర



అమ్మవారి దర్శనం కోసం భక్తుల క్యూలైన్

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోత్లాపూర్ గ్రామ శివారులో ఉన్న రేణుక ఎల్లమ్మ జాతర కొనసాగుతోంది. ప్రతి మంగళ, శుక్రవారంలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కర్ణాటకతో పాటు తెలంగాణ నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తుల కొంగు బంగారం కోత్లాపూర్ రేణుక ఎల్లమ్మ జాతర సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్రవంతి

ఎస్సై స్రవంతి

బంట్వారం: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని కోట్‌పల్లి ఎస్సై స్రవంతి ఆకాంక్షించారు. మండల పరిధిలోని అన్నాసాగర్ యూత్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై స్రవంతి మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు నగదు బహుమతులతో పాటు మోమెంటోలు అందజేసింది. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు తమకు నచ్చిన క్రీడల్లోనూ ప్రతిభ చూపాలన్నారు. క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రికెట్ పోటీల్లో కొత్తపల్లి యువకులు విజేతలుగా నిలిచి రూ.4వేలు నగదు బహుమతి అందుకున్నారు. అలాగే, అన్నాసాగర్ గ్రామానికి చెందిన యువకులు రన్నర్స్‌గా నిలిచి మూడు వేల నగదు బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో ఎఎస్సై అంబదాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు మరోవారం రోజులే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: ఈ నెల 30న జొన్నల కొనుగోలు కేంద్రం ముగుస్తుందని మరోవారం రోజులు పొడిగించాలని మంగళవారం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని రైతులు కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి జొన్నల కొనుగోలు కేంద్రాన్ని కొనసాగించాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి వారం రోజుల కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రఘునాథ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

రేపే చివరి గడువు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రభుత్వం ఇంటర్మీడియేట్‌లో ఉచిత కార్పొరేట్ విద్యను అందించే అవకాశం కల్పిస్తోందని ఎంఈఓ సయ్యద్ అక్బర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఉచిత కార్పొరేట్ విద్యకు ఈనెల 30వ తేదీవరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన కనీసం 7 జీపీఏ సాధించిన విద్యార్థులు ఇంటర్‌లో కార్పొరేట్ విద్యను ఉచితంగా పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఇంటర్మీడియేట్‌లో ఎంపిక చేసిన మూడు కళాశాలలో సీట్లు కేటాయిస్తారన్నారు. ఫీజులను ప్రభుత్వమే ఆయా కళాశాలల యాజమాన్యాలకు చెల్లిస్తోందని చెప్పారు. విద్యార్థులు మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు సమయంలో ప్రాధాన్యత క్రమంలో విద్యార్థులు మూడు కళాశాలలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జూన్ 3న ఎంపిక జాబితా ప్రకటిస్తారు. 6 నుంచి సర్టిఫికెట్లు పరిశీలన ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాల వివరాలతో కూడిన సమాచారం ఇస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ దివ్యాంగులు, మైనార్టీ, ఈబీసీ, వర్గాలకు చెందిన వారై ఉండాలన్నారు. జెడ్పీహెచ్‌ఎస్, ఎయిడెడ్, కేజీబీవీ, నవోదయ, గురుకులాలు, ఆద ర్శ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద చదివిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పత్రం, కుల ధ్రువీకరణ పత్రాలను, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లను జతచేయాలి. అలాగే, బ్యాంక్ పాస్‌బుక్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివినట్లుగా కనీసం మూడేళ్ల బోనఫైడ్‌లను జతచేయాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాలు కొనండి

ఏఈఓ శ్రీనివాస్



తాండూరు రూరల్: బెల్కటూర్‌లో మాట్లాడుతున్న ఏఈఓ శ్రీనివాస్

తాండూరు రూరల్: నాణ్యమైన విత్తనాలు కొనాలని ఏఈఓ శ్రీనివాస్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని బెల్కటూర్‌లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని రైతులకు లూజు విత్తనాలు కొనొద్దని సూచించారు. గుర్తింపు పొందిన ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు. తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు.

లూజు పత్తి విత్తనాలు కొనొద్దు

మోమిన్‌పేట: లూజు పత్తి విత్తనాలు రైతులు కొనుగోలు చేయొద్దని ఏఈఓ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలంలోని ఎన్కేపల్లి గ్రా మంలో నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. గ్రామాల్లోకి నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపా రస్తులు వచ్చి లూజుగా అమ్ముతుంటారు. ధర తక్కువగా వస్తున్నాయని రైతులు కొని మోసపోవద్దని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

బొంరాస్‌పేట: విత్తన కొనుగోళ్లలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని కొడంగల్ ఏడీఏ శంకర్ రాథోడ్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని బాపన్‌చెర్వుతండాలో నాణ్యమైన విత్తనాల కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ జారీ చేసిన లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. బిల్లుపై విత్తన కంపెనీ పేరు, లాట్ నం. గడువు తేదీ, డీలరు సంతకం ఉన్న రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. అలాగే, వరిలో మొలకశాతాన్ని స్వయంగా రైతులు పరీక్షించుకునే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలోఏఈఓ హేమ, మాజీ సర్పంచు లక్ష్మణ్‌నాయక్ రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో సాగు



దోమ : అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

దోమ : గ్రామాలల్లోని రైతులు నాణ్యమైన విత్తనాలతో పంటలను సాగు చేయాలని పరిగి తాలూక వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) సౌభాగ్యలక్ష్మీ కుమారి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బాస్‌పల్లి గ్రామంలో వానాకాలం సీజన్ సంబంధించిన పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ..ప్రతి రైతు ఫర్టిలైజర్ దుకాణాలలో నాణ్యతతో కూడిన విత్తనాలను కొనుగోలు చేసి పంటలను సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి కావ్య, రైతులు కృష్ణ, వెంకటయ్య, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.